కథ

# లేఖా సుందరి

మార్చి ఎండలు మండిపోతున్నాయి.

ఆఫీసులో మార్చి క్లోజింగ్ ఇంకా పక్షం రోజులే వుండడంతో వర్క్ కూడా ఊపిరి సలపకుండా ఉంది సాయికృష్ణకు. అలాంటి సమయంలో ''సార్ మీకు లెటర్'' అంటూ ప్యూన్ ఇచ్చిన ఉత్తరాన్ని కాస్త ఆశ్చర్యంగా అందుకున్నాడు. కారణం తనకు ఆఫీసుకు లెటర్స్ రాసేవాళ్లెవరూ లేరు. కొత్తగా పెళ్లయ్యాక ఇక్కడ కాపురం పెట్టి సంవత్సరం కూడా కాలేదు. ఎవరి బంధువుల నుండి ఉత్తరాలు వచ్చినా ఇంటికే వస్తాయి. అలాంటిది ఆఫీస్‌కు ఉత్తరం రావడం అదే మొదటిసారి కావడంవల్లనే అంత విస్మయం. పైగా పరిచయంలేని ముత్యాలాంటి దస్తూరి. అతని కనులు అక్షరాల వెంబడి పరుగులు తీసాయి.

సాయికృష్ణగారికి,

హలో...విష్ యూ మెనీ మెనీ హేపీ రిటర్న్స్ ఆఫ్ ది డే. 'థాంక్యూ' అనక ఏమిటండీ బాబూ...అసలే విశాలమైన ఆ నేత్రాలను మరింత విశాలం చేసి క్రింది సంతకం చూసి ఎవరీ సుధ...నా బర్త్‌డే ఈ రోజని ఈవిడకెలా తెలుసు? అని ఆలో చిస్తున్నారా? అంత శ్రమపడకండి. 'వేర్ దేరీజె విల్ దేరీజె వే' అని కదా సామెత. మన సైన, ఇష్టమైన వారి గురించి ఎంత కష్టపడైనా తెలుసుకోవచ్చు.

''సుధా! రాగ సుధ! అనురాగ సుధ' అంటూ పాడారు గుర్తొచ్చానా? ఊహూ తట్టలేదు కదూ...నేను మీకు చాలా పరిచయమున్నదాన్ని. ఒక్కరోజైనా మిమ్మల్ని చూడకుండా ఉండలేనిదాన్ని. ప్రతిరోజూ మీ తలపులతోనే మనసు తలుపుల్ని మూసేసేదాన్ని. ఏమిటీ! పైత్యం బాగా ప్రకోపించింది అనుకుంటున్నారా? నాకు తెలుసు. ఆడవాళ్ళు మగవాళ్ళ వెంటపడితే తేలిగ్గా తీసేసే జాతేగా మీది. మరి తెలిసి ఎందుకు అలా చేస్తున్నావంటున్నారా? ఏం చేయను...ఎంతో తర్జనభర్జనపడి ఇక ఆగలేక మీముందు వెళ్ళగక్కుతున్నాను.

అన్నట్లు 'గుడ్ వైఫ్ అండ్ హెల్త్ ఈజ్ మాన్స్ వెల్త్' అంటారు. కాబట్టి నేను మీ వెల్త్ కోసం సహాయపడాలనుకుంటున్నాను.

రేడియోలో 'ఎటో వెళ్లిపోయింది మనసు...ఇలా ఒంటరిదయ్యింది వయసు' పాట వస్తుంది. మరి మీతోపాటే వెళ్లిన నా మనస్సు గూర్చి పాడుకోవాలిగా. ఇక వుంటాను.

సుధ

ఉత్తరం చదవడం ముగించగానే ఆలోచనలో పడ్డాడు సాయికృష్ణ.

ఎవరీ సుధ!

తనకు తెలిసి కాలేజీలో ఇద్దరు సుధలు వుండేవారు. కానీ వారిద్దరి చేతివ్రాత తనకు తెలుసు. ఈ చేతివ్రాతతో తనకు తెలిసినవాళ్లెవ్వరూ లేరు.

కాలేజీలో కూడా తను రిజర్వ్‌డ్‌గా ఉండేవాడు. కానీ ఆ పాట తనకిష్టం అని కాలేజీలో ఒకసారి పాడితే తన ఫ్రెండ్సంతా ఎలా ఏడిపించారో తను ఇంకా మర్చిపోలేదు. పెళ్లయ్యాక కూడా ఆ విషయం చెప్పి తన భార్యను నవ్వించాడు.

అసలే కొత్త కాపురం. తన మనసులో తన భార్య అమృత తప్ప మరొకరు లేరు. ఒకవేళ ఈ ఉత్తరం తనకి చూపెడితే ఆ పాట అప్పుడు పాడినందుకు ఆ పేరున్న అమ్మాయే ఉత్తరం ఎందుకు వ్రాస్తుంది? నిజంగానే ఏదో ఉందని అనుమానం పెట్టుకోవచ్చు. తనేం తప్పు చేయలేదు కాబట్టి ఆమెకు ఇది చూపించి లేని అపార్థాలకు తావివ్వడం అనవసరమనిపించి ఆ విషయం మర్చిపోయాడు.

కానీ మళ్లీ గుర్తు చేస్తూ తెల్లవారాక మర్నాడు మరో ఉత్తరం వచ్చింది.

డియర్ సాయికృష్ణ,

'హలో సారూ...భలేవారు...చెలి వలపు తెలుసుకోరు. తమరెంతో అల్లరివారు...నా మనసు దోచినారు'

అర్థం అయిందనుకుంటాను నేనెవరినో? యస్! యూ ఆర్ కరెక్ట్. ఐయామ్ సుధ. ఏమిటీ శృతిమించి రాగాన పడుతోందని అనుకుంటున్నారా? ఏం చేయను? మీరు శృతిచేసి వదిలాక రాగం తియ్యకుండా ఎలా ఉండను. ఉంటే మీ శృతిలో తప్పుందనుకోరూ! ఆ విషయం నాకిష్టం లేదుగా!

ఏమిటీ! ఎప్పుడూ తక్కువగా మాట్లాడుతూ కళ్లతోనే సంభాషిస్తారు. అబ్బ! అంత ఆశ్చర్యమెందుకు? ఇన్ని విషయాలు నేనెలా పసిగట్టాననా! నే చెప్పాగా! నా ఊహలు అన్నీ మీ చుట్టే అల్లుకుని మిమ్మల్ని విశ్లేషించడంలో బిజీగా ఉండటాన్ని ఇష్టపడతాయని. అందుకే 'దేర్ ఆర్ వాయిస్ అండ్ వర్డ్స్ ఇన్ ఎ సైలెంట్ లుక్' అన్నది ఎంతో నిజమనిపిస్తుంది మీ కళ్లల్లోకి చూస్తే.

మీ టైం బాగా తింటున్నట్టున్నాను కదూ! ఫరవాలేదులే. రోజంతా మీరు నా టైం తినడంలేదు (ఏ పనీ చేసుకోనివ్వకుండా నా తలపుల్లోకొచ్చి) నే తింటే తప్పేం లేదులే. అలా బుంగమూతి పెట్టకండి. నేతాళలేను. బై.

మీ సుధ

''అమ్మో! ఏమిటీ అమ్మాయి రోజురోజుకీ శృతి మించుతోంది'' అనుకున్నాడు సాయికృష్ణ.

ఇలా రోజు విడిచి రోజు ఒక ఉత్తరం వస్తున్నాయి. ఆమెతో తనకి పెళ్ళయిందని, ఈ వయసులో ఏదైనా ఇలాగే ప్రేమ అన్పిస్తుందని కాని అది ఆకర్షణ కాబట్టి ఈ పిచ్చి పెంచుకోకుండా తల్లీదండ్రీ చూసిన సంబంధం చేసుకో అని చెప్పాలని ఎంతగానో అన్పించింది సాయికృష్ణకు.

కానీ ఎప్పుడూ ఫ్రమ్ అడ్రస్ ఉండేదికాదు. ఎంత ఆలోచించినా ఎవరో గుర్తు పట్టలేకపోయాడు. కానీ తనకు తెలియకుండానే ఆ ఉత్తరం కోసం ఎదురుచూడడం చింపెయ్యాలనుకుని ఎన్నిసార్లు అనుకున్నా మనస్సు ఆ మాట విననని మొండికేసి అపురూపంగా మనస్సులో భద్రపరచుకోవడం చేసేది. ఆ ఉత్తరాలు కూడా ప్రతిసారీ ఎంతో చదవాలనిపించేలా ఉండేవి.

మొన్న ఒక సీరియల్‌లో ఒక కొటేషన్ చదివాను. 'ఐ లవ్ యు మోర్ దాన్ ఎస్టర్‌డే అండ్ లెస్ దాన్ టుమారో' అని. నిజంగా ఎంత బావుందోకదా! నా మనస్సును విప్పి ఇలా చెప్పడానికి నాకు భావం, భాష లేక మూగబోతే ఆ విధంగా నేను చెప్పేలా చేయడానికి ఆ కొటేషన్ ఇచ్చారేమో అన్పించింది అంటూ రాసేది. 'ఏమిటి...నేను నా అడ్రస్ రాయకుండా మీ మనస్సులో భావాలు తెలుసుకోకుండా ఇలా (మరీ ఇలా బరితెగించి) రాస్తున్నందుకు మీకు అసహ్యంగా వుందా?' అంటూ రాసేది.

'నా అడ్రస్ ఇవ్వకుండా ఎప్పటికీ నేనే మిమ్మల్ని వేపుకు తింటున్నా అన్న లెవెల్లో ఏంటా కోపం? ముక్కు మీద కోపం మీ ముఖానికే అందం' అంటూ పాడాల్సి వస్తోంది. ఎందుకు ఆ ముఖం అలా ఎర్రగా చేసుకుంటారు? ఆ కోపాన్ని తగ్గించుకుని కొంచెం చిరునవ్వు తెచ్చుకోండి అని రాసేది.

ఆ రోజు క్లోజింగ్ డే. చాలా బిజీగా వున్నప్పుడు ఉత్తరం వచ్చింది. అంత తొందరలోనూ కూడా దానిని చదవకుండా ఉండలేకపోయాడు.

ప్రియమైన మీకు,

శుభోదయం! ఆషాడ వర్ష గాఢచ్ఛాయలలో, రహస్యపు బడుగులలో, రాత్రివలె నిశ్శబ్దంగా నడుస్తో ఉంటావు నువ్వు వెతికే వారిని తప్పించుకుంటూ.

విసురుగా వీచే తూర్పు గాలి పిలుపుల్ని లక్ష్యపెట్టక నేటి ఉదయం తన కళ్ళని మూసుకుంది. అరణ్యం పాటలు ఆపి నిశ్శబ్దమైంది. ప్రతి ఇంటి తలుపులూ మూసేసుకున్నారు. నిర్జనమైన వీధిలో నువ్వొక్కడివే పాంథుడివి. నా ఏకైక సఖా! ప్రియతమా! నా ఇంట తలుపు తెరిచి ఉంచాను. కలవలె జారిపోకు.

ఇది ఎందులోనిదో గుర్తు పట్టారనుకుంటాను. కరెక్ట్. గీతాంజలి. ఎంత బావుంద్కదూ. నిజంగా మనస్సులోని భావాలకు అద్దం పట్టినట్టు ఎలా రాయగలుగుతారో కదా!

ఈ ఉత్తరాలతో మీకు పరిచయమై నేటికి పక్షంరోజులు అయిపోయాయి. ఇంతకాలం వన్ వే ట్రాఫిక్‌లా నావైపు నుండే తప్ప మీవైపునుండి మీ భావాలు తెలిపే అవకాశం ఇవ్వలేదు కనుక రేపు ఉదయం తొమ్మిదిగంటలకు శివాలయం కోవెలకొస్తే అక్కడ కోనేటి మెట్ల దగ్గర క్రింది నుండి నాల్గవ మెట్టుపైన ఎర్ర చీర కట్టుకుని కూర్చుంటాను. రేపు మనం మాట్లాడే మాటలపైనే మిగతా అన్ని విషయాలూ ఆధారపడి వుంటాయి కనుక ఈ పరిచయానికి బహుశా ఇది చివరి ఉత్తరమేమో! ఉంటాను.



మీ సుధ

ఎందుకో ఇంక ఉత్తరాలు రావు అనుకోగానే చాలా బాధనిపించింది. కానీ పోనీ ఇదీ ఒకందుకు మంచిదే. ఉత్తరాల వల్ల తన మనసు తన అదుపు తప్పుతుందేమో! [illegible] కల్సినప్పుడు తనకు పెళ్లయిందనీ, అలాంటి ఉద్దేశాలు లేవనీ చెప్పేయాలి. ప్చ్...ఏమిటో ఉత్తరాల్లో ఎంత భావుకత! ఇక నుండి మళ్లీ యాంత్రికంగా అవుతుందేమో [illegible] లైఫ్! అనుకున్నాడు సాయికృష్ణ భారంగా.

★★★

తెల్లవారి ఇంట్లో నుండి ఎనిమిది గంటలకే బయలుదేరి మేనేజర్‌గారింటికి వెళ్లి రాత్రి క్లోజింగ్ వివరాలన్నీ చెప్పి ముఖ్యమైన కాగితాలన్నీ ఇచ్చి పదిగంటల వరకు ఆఫీస్‌కు వస్తానని చెప్పి కోవెలకు వెళ్లేసరికి తొమ్మిదిగంటల పది నిముషాలయ్యింది. గబగబా ఆమె చెప్పిన చోటుకి వెళ్లాడు. కోవెలలో ఎక్కువ జనంలేరు. కోనేటి గట్టుపై ఆమె చెప్పినట్లు నాలుగో మెట్టుపై ఎర్రచీర కట్టుకుని కోనేటివైపు ముఖంచేసి తలపైగా నిండుగా కొంగు కప్పుకుని కూర్చుని వుంది. వెనుక నుండి ఆ దృశ్యం ఎంతో అందంగా కనిపిస్తుంది. ముఖం అటువైపు తిరిగి పైగా కొంగు నిండుగా కప్పుకుని ఉండడంతో ముఖంగానీ, ఆకారంగానీ ఏదీ స్పష్టంగా తెలియడం లేదు. ఎందుకో ముఖం కూడా చూడకుండా తను చెప్పాలనుకున్నది చెప్పేసి వెళ్లిపోతే మంచిదనిపించింది సాయికృష్ణకు. ఎందుకంటే మనిషిని చూఢకుండా కేవలం ఉత్తరాలే ఇంత సంచలనం సృష్టించాయి తన మనసులో. ఆ ఉత్తరాలలో ఇంత భావుకత చూపించి మనస్సును ఊపేసిన మనిషికి, ప్రత్యక్షంగా కనిపించినప్పుడు మనస్సాకట్టుకునేలా కట్టిపడేయడం ఎలాగో తెలియదా? అనుకుంటూ కొంచెం దగ్గి ''మీరు సుధగారు అనుకుంటాను?'' అన్నాడు.

అవునన్నట్లు తల పైకీ కిందకీ ఆడించింది. వెంటనే ఆవిడ ఇటు తిరక్కుండానే ఆమెవైపు వెన్ను ఉండేట్లు వెనుదిరిగి పైరెండు మెట్లపై నిలబడి-

''చూడండి. నాకు పెళ్లయింది. నేను నాకు తెలియకుండా మీలో ఆశలు రేపితే నన్ను క్షమించండి. నాకు ఎవరితోనూ ఎలాంటి అనుబంధాలు లేవు. కాబట్టి మీరు నన్ను చూసి ఎవరో అనుకుని పొరబడి వుంటారు. నేను అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ నా భార్యనే ప్రేమిస్తాను. ఈ విషయం శృతి మించకుండానే చెబుదామనుకున్నాను. కానీ మీ అడ్రస్ ఇవ్వలేదు. ఇవాళ కూడా కేవలం ఇది చెబుదామనే వచ్చాను. ఇకపోతే ఎందుకో మీ ఉత్తరాలలోని భావుకత్వం నా హృదయాన్ని కదిలించింది. మిమ్మల్ని చేసుకునేవారు అదృష్టవంతులు. విష్ యూ బెస్టాఫ్ లక్' అన్నాడు సాయికృష్ణ వెళ్ళడానికి సన్నద్ధుడవుతూ.

ఇంతలో ''కంగ్రాట్స్'' అన్న చాలా పరిచయమైన గొంతు వినబడడంతో వెనుదిరిగాడు. ముఖానికి అడ్డంగా ఒక అట్టముక్కతో లేచి నిలబడి ఉందామె.

ఆ అట్టపై 'ఏప్రిల్ ఫూల్' అన్న పెద్ద అక్షరాలు ఇంగ్లీషులో రాసి వున్నాయి. ఫూల్‌లోని రెండు సున్నాల్లో పకపక నవ్వుతున్నట్లున్న కళ్ళు, ముక్కు, నోరు తెరిచిన బొమ్మలు వేసి వున్నాయి.

మొహమంతా ఎర్రగా కందిపోగా ఏదో అవమానంతో ముఖానికి అడ్డంగా ఉన్న అట్ట తొలగించాడు.

అతని అనుమానం నిజమే.

ఆమె అమృత.

''కంగ్రాట్స్! ఎందుకంటే చేసుకునేవారు ఎంత అదృష్టవంతులో అన్నారు కదా. ఆ అదృష్టవంతులు మీరే కాబట్టి. ఏమిటిలా నిలబడిపోయారు. నా పేరు సుధ ఏమిటా అనా? అవును మరి సుధ అంటే అమృతమేగా! ఇక 'సుధ...అనురాగ సుధ' పాట పాడితే కాలేజీలో ఎలా ఎగతాళి చేసారన్నది మీరే నాకు చెప్పారు. దస్తూరి నాకు రెండురకాలుగా రాయడం వచ్చు. అందులో మీరు ఒక రకమే చూసారు. పైగా పెళ్లయ్యాక మీకు దూరంగా వుండి ఎప్పుడూ ఉత్తరం రాయలేదు. అందుకే ఈసారి సరదాగా మిమ్మల్ని ఆట పట్టిద్దామనుకున్నాను. దగ్గర్లో ఏప్రిల్ కన్పించింది. వైరైటీగా వుంటుందని ఈ పని చేసాను. అసలు ఇన్నిరోజులు మీరు లెటర్స్ గురించి నాతో ఏమీ చెప్పకపోతే నా దగ్గర్నుండి దాస్తున్నారని ఎంత బాధపడ్డానో తెలుసా? ఏంటీ కోపమొచ్చిందా? ఐయామ్ వెరీ వెరీ సారీ! మీ మనస్సును నొప్పిస్తే...లేకపోతే 'ఇంత మౌనమేలనోయి' అని పాడాల్సి వస్తుంది' అంటున్న అమృతని చూసి నవ్వేస్తూ ''ఒకే...కానీ నాకు తెలియని ఈ ఎర్రచీర ఇంత పెద్ద చిరుగున్నది బయటకు కట్టుకొచ్చావేం'' అన్నాడు సాయికృష్ణ.

''అయ్యో! ఎక్కడ చిరిగింది?'' అంటూ వెనుదిరిగి చీర చూసుకుంటున్న అమృత కళ్లముందు 'ఏప్రిల్ ఫూల్' అట్ట ఉంచి, 'నీ బాకీ నేనుంచుకోను' అన్నట్లు చూస్తున్న సాయికృష్ణ ముఖంలోకి ఉక్రోషంగా చూసి నవ్వేసిన అమృతతో శృతి కలిపాడు.

**(ఈ కథకి రచయిత(త్రి) పేరు, చిరునామా రాయలేదు)**